# పఠనం ఆగిపోయి.. నైపుణ్యం తగ్గిపోతోంది






- మాతృభాష ద్వారానే లోతైన అవగాహన
- నేటి తరానికి నచ్చే రచనలు చేయాలి
- గ్రంథాలయాలను పునరుద్ధరించాలి
- కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు

'పుస్తక పఠనం తగ్గిపోయాక, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పడిపోతున్నాయి. నేడు విద్యార్థులు చిన్న వ్యాసం రాయాలన్నా ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారు. కావాల్సిన సమాచారాన్ని అప్పటికప్పుడు వెతికి తీసుకుంటున్నారు. స్వీయ ఆలోచనాధార లోపిస్తోంది. తద్వారా నైపుణ్యం, జ్ఞాపకశక్తి కోల్పోతున్నారు' అని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు వివరించారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. 'నేటి తరాన్ని చదివించేలా రచనలు చేస్తే, పుస్తకాలకు మళ్లీ ఆదరణ పెరుగుతుంది. గతంలో ఊరూరా గ్రంథాలయాలుండగా, వాటితో ప్రజలందరికీ అనుబంధం ఉండేది. పిల్లలు, గృహిణులు, వయోధికులు పుస్తకాలు తెచ్చి చదువుకొని, వాటిలోని భాష, సంస్కృతి, పాత్రల్లో లీనమయ్యేవారు. స్ఫూర్తి పొందినవారు రాయాలని ప్రయత్నించేవారు. వారిలో కొందరు మంచి రచయితలుగా ఎదిగేవారు' అని ఉదహరించారు. వివిధ అంశాలపై శ్రీనివాసరావు అభిప్రాయాలు ఆయన మాటల్లోనే.

## మన విద్యావిధానం మారాలి

మన విద్యావిధానం మారాలి. జపనీయులు వారి మాతృభాషలోనే చదువుకుంటారు. వాళ్లు దేనిలోనూ వెనుకంజలో లేరు. మన నూతన జాతీయ విద్యావిధానంలోనూ మాతృభాషలో విద్యాబోధన సాగాలన్న అంశంపై దృష్టి సారించారు. అలాగే, పాఠశాలల్లో రోజూ కనీసం ఒక్క పీరియడ్ అయినా పుస్తక పఠనానికి కేటాయించాలి. మొబైల్ ఫోన్ రాకతో మన శక్తి సామర్థ్యాలు తగ్గిపోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. సాంకేతికత అవసరమే గానీ, మన తిరోగమనానికి కారణం కాకుండా చూసుకోవాలి. ఫోన్ నంబర్లూ గుర్తుపెట్టుకోలేని స్థితికి రావడం సరికాదు. ఓపిక, సహనం కూడా లేకుండా పోతున్నాయి.




## ఏటా రూ.10 కోట్ల పుస్తకాల విక్రయం

కేంద్ర సాహిత్య అకాడమీ 24 భాషల్లో పుస్తకాలు ప్రచురిస్తుండగా, ఏటా సుమారు రూ.10 కోట్ల విలువైన పుస్తకాలు అమ్ముడవుతున్నాయి. గత నాలుగేళ్లలో విక్రయాలు బాగా పెరిగాయి. అందరినీ చదివించే మంచి రచనలు వస్తే, ఆదరణ ఉంటుందనడానికి ఇదే నిదర్శనం. ప్రస్తుతం సమయం, తరం రెండూ మారాయి. 40 ఏళ్ల కిందటిలా రచనలు చేస్తే, నేటి తరాన్ని మెప్పించలేరు. ఈ తరానికి నచ్చేవేవి? ఆసక్తి కలిగించేవి ఏవన్నది గుర్తించి ఆ పంథాలో రచనలు చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని రచనల్లో సృజనాత్మకంగా మేళవించాలి. 35 ఏళ్లుగా విజయవాడ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నవారికి ప్రభుత్వ సహకారం అవసరం. ఏటా ఒకేచోట ప్రదర్శన జరిగేలా సరైన వేదికను కేటాయించాలి. ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, మెక్సికో, హవానా, షార్జా పుస్తక ప్రదర్శనల విజయరహస్యం.. అక్కడ స్థిరమైన వేదికలు ఉండటమే

## కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో గ్రంథాలయాలు భేష్

ఏపీలో మూతపడిన గ్రంథాలయాలన్నింటినీ పునరుద్ధరించడం తేలికే. నిధులకు కొరత లేదు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గ్రంథాలయాల పునరుద్ధరణకు గత బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రాష్ట్ర వాటా తెచ్చుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వ చొరవ అవసరం. కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో గ్రంథాలయాలు బ్రహ్మాండంగా నడుస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి